క్లుప్తంగా

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీబంగారమ్మ

కార్వేటినగరం: గ్రామదేవతగా విరాజిల్లుతున్న శ్రీబంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, నారికేళ జలాలు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి మూల విరాట్‌ను పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి, పిండి దీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అధ్యక్షుడు ప్రసాద్‌చేతుల మీదుగా భక్తుల తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రంగనాథమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలు సేకరించాలి



రైతు భరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ హేమలత

కార్వేటినగరం: పంట సాగులో నాణ్యమైన దిగుబడి సాధించడానికి మట్టినమూనాలు సేకరించి, భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.హేమలత సూచించారు. మంగళవారం మండలంలోని కొటార్వేడు, గోపిశెట్టిపల్లి ఆర్బీకేలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంట సాగులో రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. అలాగే పంట సాగుకు సన్నద్ధమైన రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఆయా పంచాయతీల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్దకు మట్టిని తీసుకొచ్చి సిబ్బందికి చేర్చాలని సూచించారు. అనంతరం కొటార్వేడు, గోపిశెట్టిపల్లిలోని రైతు భరోసా కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రైతుభరోసా కేంద్రాల్లో యూరియా

నగరి : మండలంలోని 8 రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుగ్గ అగ్రహారంలో 4.23 టన్నులు, గుండ్రాజుకుప్పంలో 5.22 టన్నులు, ఎం.కొత్తూరులో 2 టన్నులు, ముడిపల్లిలో 4.5 టన్నులు, నంబాకంలో 4.27 టన్నులు, ఓజీ కుప్పంలో 5.44 టన్నులు తెరణిలో 2.56 టన్నులు, వీఎన్‌ఆర్ పేటలో 3.19 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అవసరమైన రైతులు కొనుగోలు చేసుకోవచ్చన్నారు.

నిండ్ర మండలంలో..

నిండ్ర: మండలంలోని రైతులకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మంగళవారం అయన మండల కేంద్రంలో మాట్లాడుతూ నిండ్ర, అరూరు, ఇరుగువాయి, అగరం, మేళంబాకం, పాదిరి గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో యూరియా, 20-20-0-13 అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు తీసుకోవచ్చని తెలిపారు.

పిల్లలకు ప్లేట్ల వితరణ



ప్లేట్లు అందుకున్న చిన్నారులతో దాత నరేష్

వెదురుకుప్పం: మండలంలోని సంతబయలు ప్రాథమిక పాఠశాలలోని పిల్లలకు గ్రామ కార్యదర్శి నరేష్ మంగళవారం ప్లేట్లు వితరణ చేశారు. విద్యార్థుల కోసం తన వంతు సాయంగా అందరికీ ప్లేట్లు, గ్లాసులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో సీఆర్పీ విక్కీదాదా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28న మండల మీట్

నిండ్ర: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28 తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భవానీ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దూరం

- విద్యార్థులకు హోమియో మందు పంపిణీ
- ప్రభుత్వ హోమియోపతి డాక్టర్ సునీత



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సునీత

పుత్తూరు: ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో వాతావరణంలో మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులు దూరం అవుతాయని స్థానిక ప్రభుత్వాస్పత్రి హోమియోపతి డాక్టర్ సునీత సూచించారు. మంగళవారం గేట్‌పుత్తూరులోని తమిళ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు 'సీజనల్ వ్యాధులు-జాగ్రత్తలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సునీత మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితమై ప్రజలు డయేరియా, వైరల్ ఫీవర్ బారిన పడే అవకాశం ఉందన్నారు. వీటి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థులకు ముందస్తు జాగ్రత్తలో భాగంగా హోమియో మెడిసన్ హోరసినిక్ ఆల్బమ్-200 మందును పంపిణీ చేశారు. అలాగే ఆహార, పరిశుభ్రతపై సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణవేణి, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా మెలగాలి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా మెలగాలని గొల్లపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్ సూచించారు.



గొల్లపల్లిలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్

మంగళవారం మండలంలోని గొల్లపల్లి పీహెచ్‌సీలో అంగన్‌వాడీ వర్కర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు, సిరప్ అందుబాటులో ఉంచుకుని అవసరమైన వారికి అందించాలని సూచించారు. డయేరియా సోకిన వారు భోజనానికి ముందు, టాయిలెట్‌కు వెళ్లిన తరువాత చేతులను సోప్‌తో శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. వేడి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

మున్సిపల్ కార్యాలయంలో..

సీజనల్ వాధ్యులపై ప్రజలను అప్రమత్తత చేయాల్సిన బాధ్యత అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య సిబ్బందిపై ఉందని మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పుత్తూరు అర్బన్ పరిధిలోని అంగన్‌వాడీ



విద్యార్థులకు మందు వేస్తున్న డాక్టర్ సునీత

వర్కర్లకు, వైద్య సిబ్బందికి సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, అర్బన్ హెల్త్‌సెంటర్ డాక్టర్ రమేష్, సీడీపీఓ పద్మజ, సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

డయేరియా వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న వైద్య సిబ్బంది



స్టాప్ డయేరియా కార్యక్రమంలో వైద్యాధికారులు

గంగాధర నెల్లూరు: డయేరియా వ్యాప్తిని అరికట్టాలని, తగిన జాగ్రత్తలతో తరిమి కొట్టాలని మండల వైద్యాధికారి డాక్టర్ దుర్గాదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎక్కడైనా డయేరియా పేషెంట్లు ఉంటే ఓఆర్‌ఎస్ ద్రావణం, నిర్దేశించిన మోతాదులో 14 రోజులు జింక్ మాత్రలు సరఫరా చేయాలన్నారు. ఎంపీడీఓ భాస్కర్, డాక్టర్ లిఖిత, ఈఓపీఆర్డీ రాఘవేంద్ర రాజు, సీహెచ్ఓ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డయేరియా రాకుండా ముందస్తు చర్యలు

పాలసముద్రం: వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధి అయిన డయేరియా రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు ఇంటి పరిసర ప్రాంతాలలో ఈగలు, దోమలు చేరకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీరు, క్లోరినేషన్ చేయబడిన నీటినే తాగాలని కోరారు. బయటి ఆహార పదార్థాలు తినకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు.



ఎంపీడీఓ రామనాథరెడ్డి

ఆగమోక్తంగా సంకట హర చతుర్దశి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీఅంజి అంజి వినాయకస్వామి సన్నిధిలో మంగళవారం ఆగమోక్తంగా సంకటహర చతుర్దశి పూజలు నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబం నిర్వహించుకునే విధంగా దేవస్థానం ఆర్జిత సేవగా తీసుకువచ్చింది. మంగళవారం ఆలయ ఆవరణలో ధ్వజస్తంభం సమీపంలో ఉండే శ్రీఅంజిఅంజి వినాయకస్వామి సన్నిధిలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించి, దీపధూప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.దేవస్థానం ఈఓ నాగేశ్వర రావు, ఆలయ అధికారులు, పాల్గొన్నారు.



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

వైభవంగా మోహినీ ఉత్సవం



సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలకు పాలాభిషేకం చేస్తున్న అర్చకులు



స్వామి వారికి హారతులిస్తున్న వేదపండితులు, పూజల్లో పాల్గొన్న ఉభయకర్తలు

తవణంపల్లె: టి.పుత్తూరులోని శ్రీ కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం మోహినీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయంలో వేదపండితులు ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం సంతపేటకు చెందిన ఉభయదారులు రఘు కుటుంబసభ్యులు స్వామికి తిరుమంజనం, ఉభయకర్త ఈశ్వరి కుటుంబసభ్యులు పాలాభిషేకం చేయించారు. మధ్యాహ్నం ఉభయదారులు రాజారెడ్డి కుటుంబసభ్యులు మోహినీ ఉత్సవానికి పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధ పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. సాయంత్రం రాజేష్‌కుమార్ రెడ్డి కుటుంబసభ్యులు ఉట్లోత్సవాన్ని నిర్వహించారు.

చక్రస్నానం

సాయంత్రం ఉభయకర్తలు రవిచంద్రారెడ్డి కు టుంబసభ్యులు వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణిలో వేదపండితులు శాస్త్రోక్తంగా అభిషేకం, పూజలు, చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి వైభవంగా ధ్వజావరోహణం చేయించారు.

నేడు సూర్యప్రభ వాహనం సేవ

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, తిరుమంజనం, పాలాభిషేకం, రాత్రి సూర్యప్రభ వాహనం సేవ నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

ఎదురొడ్డి పోరాడుదాం

- ఎన్నికల్లో గెలుపోటములు సహజం
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి



నాయకులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కష్టకాలంలో ఎదురొడ్డి పోరాడుదాం... ఎప్పుడూ కాలం ఇలాగే ఉండదు.. గతంలో ఎన్నో మంచి పనులు ప్రజలకు చేశామని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో 1-50 డివిజన్ల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పనిచేశారని, అయితే ఓటమికి కుంగిపోతే ముందుకు సాగలేమన్నారు. చిత్తూరులో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందామన్నారు. అధికార పక్షం పనిగట్టుకుని దాడులు చేయడం సరికాదని, వాటిని న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. నాలుగు నెలల్లో జగనన్న బాధితుల ఇంటికి వచ్చి భరోసానిస్తారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై అపోహలు వద్దని, ఇప్పుడు చట్ట ప్రకారం ఎన్నికలు పెట్టలేరన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు ఇచ్చిన హామీలను తీర్చకపోతే వారి తరఫున ఐక్యంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అందరూ సంఘటితంగా ఉంటూ పార్టీని కాపాడుకుందామని మేయర్ అముద అన్నారు. దాడులకు భయపడవద్దని, తామంతా అండగా ఉంటామని చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి అన్నారు. తన కారును ధ్వంసం చేస్తే కేసు పెట్టినట్లు చెప్పారు. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, ఇప్పుడు వారిని అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కక్ష సాధింపుతో ఇలా చేస్తున్నారనేది ప్రజలూ గ్రహిస్తున్నారన్నారు. అందరూ సమన్వయంతో పనిచేద్దామని పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు లీనారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, టిమ్ము, నాయకులు, కార్పొరేటర్లు సూర్యప్రతాప్, రాహుల్‌రెడ్డి, రాంగణేష్, సరళమేరి, భాగ్యలక్ష్మి, హరిణిరెడ్డి, మధురెడ్డి, చల్లాముత్తు, పూమణి, ప్రేమ్, బాలసుబ్రమణ్యంరెడ్డి, శివ, మనోహర్, బాబీ, మనోజ్‌రెడ్డి, అన్బు, ప్రకాష్, రాజేంద్ర, సయ్యద్, చాన్‌బాషా, బాబ్లూ, నారాయణ, శరవణ, గణేష్, అల్తాఫ్ పాల్గొన్నారు.

బిందు సేద్యాన్ని సద్వినియోగం చేసుకోండి



బిందు సేద్యంపై వివరిస్తున్న ఎంఐఏఓ సతీష్

గంగాధర నెల్లూరు: తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించుకోవడానికి ఉపయోగపడే బిందు సేద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఐఏఓ సతీష్ కోరారు. గంగాధరనెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లి పంచాయతీ పెడకంటి పల్లి గ్రామానికి చెందిన రైతు జయలక్ష్మి పొలంలో అమర్చిన బిందు సేద్యం పరికరాల ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా రైతులు పైపుల వద్ద కీస్ ఫిల్టర్, హైడ్రోసైక్లోన్ ఫిల్టర్లను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అలాగే నీరు డ్రిప్ ద్వారా పంపే సమయంలో 1.5 నుంచి 2 పాయింట్ల మధ్య ప్రెజర్ ఉంచుకోవాలన్నారు. నీటిలో కరిగే ఎరువులను ప్రెజర్ 1.5 పాయింట్ల మధ్యలో ఉంచాలన్నారు. కొంతమంది రైతులు లేవనెత్తిన సమస్యలకు డ్రిప్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిష్కరించి రైతులకు వివరంగా తెలిపారు. సబ్సిడీతో డ్రిప్ కావాల్సినవారికి త్వరలోనే ప్రభుత్వం నిర్దేశించిన నియమాల మేరకు తదుపరి ఉత్తర్వులలో తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ చక్రవర్తి, ప్రొటెక్ కంపెనీ ప్రతినిధి చిన్నదొరై పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు

పాలసముద్రం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చిత్తూరు ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. పంటను సాగు చేయడంతో రసాయనాల వాడకం ఉండదని, జీవామృతం కషాయాలతో సాగు చేయాలని ఆయన సూచించారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో రైతులకు సర్పంచ్ గాలి మహేష్‌బాబు అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంలో చెరకు పంట సాగు, చీడపీడల నివారణ, అధిక దిగుబడుల కోసం జీవామృతం వాడాలని సూచించారు. కలుపు నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ ప్రకృతి వ్యవసాయంలో చెరకు పంట సాగు చేసి అందులో నుంచి బెల్లం తయారు చేయాలన్నారు. బెల్లాన్ని తిరుమల, తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తామన్నారు. రైతులకు మార్కెట్ ధర కన్నా ఐదు శాతం ఎక్కువ టీటీడీ కొనుగోలు చేస్తుందని తెలిపారు. అందువలన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకల్యాణ వెంకన్న



బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు మంగళవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం అభిషేక సేవ నిర్వహించి, మరకత మాణిక్యాలు, వజ్రవైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం విద్యుత్ దీపాలంకరణ మధ్య దేవేరులకు ఊంజల్‌సేవ చేపట్టారు. సర్వాలంకార శోభితుడైన స్వామి, అమ్మవార్లు బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, చెంగయ్య, అర్చకులు రాజశేఖర్ స్వామి, రవిచంద్రన్, జమేదారు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యం.. దిగుబడి ఘనం

వరిసాగులో సస్యరక్షణ చర్యలతోపాటు ఎరువుల యాజమాన్యం పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చంటున్నారు శాస్త్రవేత్తలు. వరి సాగులో ఎరువులు సకాలంలో సరైన రీతిలో తగిన మేరకు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు.



వరిలో ఎరువు చల్లుతున్న రైతు

పాలసముద్రం : సార్వా వరి సాగులో ఎరువుల యజమాన్యమే కీలకం. అయితే ఎరువులు వాడకంపై రైతులకు అంతగా అవగాహన ఉండటంలేదు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలను పట్టించుకోకుండా తోటి రైతన్నలు వాడుతున్నారని తమ పొలంలోనూ అవసరం ఉన్నా లేకున్నా ఎడాపెడా ఎరువులు వాడి ఖర్చులు పెంచుకుంటున్నారు. ఎరువుల యాజమాన్యంలో సరైన జాగ్రత్తలు పాటిస్తేనే అధిక దిగుబడులు వస్తాయని నగరి సబ్ డివిజన్ ఏడీఏ సౌభాగ్యలక్ష్మి చెబుతున్నారు. ఎరువుల యాజమాన్యం గురించి ఆమె మాటల్లోనే..

అధిక మోతాదులో ఎరువులు వాడితే చీడపీడలు ముప్పు తప్పదు. తొలుత భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలి. అలాగే ఎరువుల వినియోగంలోనూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

ఎరువుల వినియోగంలో రైతులకు సరైన అవగాహన లేనందున రైతులు అటు ఆర్థిక భారంతోపాటు ఇటు దిగుబడుల పరంగా నష్టపోతున్నారు. నీటి యాజమాన్యంతో పాటు రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగంలోనూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలి. వరి సాగులో రసాయన ఎరువుల వినియోగానికి రైతులు ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. అయితే ఇలా చేస్తే తెగుళ్ల సోకే ప్రమాదం ఉంది. భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వాడినప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. భూసార పరీక్షలు చేయించనప్పుడు ఎకరానికి 25 నుంచి 32 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం.12 నుంచి 16 కిలోల పొటాష్ లభించే ఎరువులను మాత్రమే వాడాలి. అంతకు మించివాడితే పంటకు తెగుళ్ల ఆశించే ప్రమాదం ఉంది.

విడతలవారీగా వాడితేనే మేలు

వరికి మూడు విడతలుగా యూరియా చల్లుకోవాలి. వరి పైరు పెరిగేందుకు నత్రజని ఎంతగానో దోహదపడుతుంది. దీనిని మూడు దఫాలుగా పొలంలో చల్లుకోవాలి. నాట్లు వేసే ముందు, దుబ్బు దశలో, అంకురం ఏర్పడే దశలో నత్రజని అందించే ఎరువులను వాడుకోవాలి. నత్రజని పోషకాన్ని సరైన మోతాదులో అందించేందుకు యూరియా వాడే విధానంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. ఎకరానికి 20 నుంచి 30 కిలోల నత్రజని అందించాలంటే 50 నుంచి 65 కిలోల యూరియాను పొలంలో చల్లుకోవాలి. దీనిని మూడు సమ భాగాలుగా విభజించి చల్లుకోవాల్సి ఉంటుంది. పైరు పెరుగుదల ఆశించిన రీతిలో లేకుంటే అదనంగా 10 నుంచి 13 కిలోల వరకు యూరియా వాడవచ్చు. యూరియా అధిక వినియోగంతో అనేక అనర్థాలు ఎదురవుతాయి. యూరియా ఎక్కువైతే వరి మొక్కల ఆకుల్లో పత్రహరితం అధికంగా ఉంటుంది. ఫలితంగా పురుగుల దాడి చేస్తాయి. అగ్గితెగులు, ఆకుముడత తెగులు కూడా సోకే ప్రమాదం ఉంది.

పొటాష్‌తో తెగుళ్ల దూరం

పొటాష్‌తో వరి పంటకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఫలితంగా తెగుళ్ల దూరం అవుతాయి. వరి మొక్కకు అవసరమైన పోషకాలను మొక్కలోని వివిధ భాగాలకు సరఫరా చేయడానికి పోటాష్ ఉపయోగపడుతుంది. వరి పంటకు అవసరమయ్యే 10 నుంచి 15 కిలోల పొటాష్ అందించేందుకు 18 నుంచి 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పొలంలో చల్లుకోవాలి. దీనిని రెండు సమ భాగాలుగా చేసి మొదటి దఫా, రెండో దఫా యూరియాతో కలిపి వేస్తే ఆశించిన దిగుబడి సాధించవచ్చు. అలాగే భాస్వరం సకాలంలో అందించాలి. మొక్కల వేరు పెరుగుదలకు పోషక పదార్థంగా భాస్వరం ఉపయోగపడుతుంది. దీన్ని నాట్లు వేసే ముందు దమ్ములో లేదా నాట్లు వేసిన 15 రోజుల్లోపు కాంప్లెక్స్ ఎరువుగా వాడాల్సి ఉంటుంది. నాట్లు వేసిన 15 రోజుల తరువాత ఈ ఎరువును పొలంలో చల్లుకున్నా ఉపయోగం ఉండదు. అయితే పొలంలో జింకులోపం తలెత్తే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ ఎరువు సకాలంలో పైరుకు అందించితే మొక్కల ఎదుగుదల, దిగుబడి బాగుంటుంది.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్‌ఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతిలోని ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఫీజులేకాకుండా అడ్మిషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో లక్షలాది రూపాయలను దండుకుంటున్నారని దుయ్యబట్టారు. విద్యను వ్యాపారం చేస్తూ అనుమతులు తీసుకోకుండా యథేచ్ఛగా కొత్త విద్యాసంస్థలు పుట్టుకొస్తున్నాయని విమర్శించారు. ఇంత జరుగుతున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా నిబంధనలకు వ్యతిరేకంగా పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శాస్త్రీయ దృక్పథం పెరగాలి

శ్రీకాళహస్తి: మూఢ నమ్మకాలను కూకటివేళ్లతో పెకలించాలంటే అందరిలో శాస్త్రీయ దృక్పథం పెరగాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్యభవన్‌లో మంగళవారం సీపీఎం శాఖ కార్యదర్శుల రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ తమ స్వార్థ రాజకీయాల కోసం భౌతిక వాదానికి బదు లు మత భావ వాదాన్ని ప్రజల్లో ప్రేరేపిస్తున్నాయన్నారు.